‘వెన్నుపోటు’పై జనగర్జన



వెంకటాచలంలో భారీ జనసందోహం మధ్య సాగుతున్న ర్యాలీ



వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, కాకాణి కుమార్తె పూజిత

- కదంతొక్కిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ర్యాలీని అడ్డుకునేందుకు పలుచోట్ల పోలీసుల అడ్డంకులు
- అన్నింటినీ అధిగమించి శాంతియుత నిరసన

వెంకటాచలం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పోటెత్తారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో ఎంపీలు మిథున్‌రెడ్డి, డాక్టర్ మద్దెల గురుమూర్తి హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలోని వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా వెంకటాచలానికి చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకే వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టిన కార్యకర్తలతో వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డుకు కిక్కిరిసిపోయింది. జై జగన్.. జై కాకాణి నినాదాలతో హోరెత్తింది.

ర్యాలీని అడ్డుకునే ప్రయత్నాలు

ఉదయం 10.45 గంటలకు సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి నిరసన ప్రారంభమైంది. అయితే ర్యాలీ ప్రారంభమైనప్పటి నుంచి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేశారు. ఈ ర్యాలీని చిత్రీకరించేందుకు మీడియా కోసం వాహనాన్ని కేటాయించగా, పలువురు విలేకరులు ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. ఈ క్రమంలో ఆ వాహనానికి అనుమతి లేదని పోలీసులు అక్కడి నుంచి పంపేశారు. ర్యాలీలో నడుస్తూ, నినాదాలు చేస్తున్న కొందరు కార్యకర్తలను తొందరగా వెళ్లాలని పోలీసులు బెదిరించారు. కాగా ర్యాలీ అక్కడి నుంచి వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకునేలోపు పోలీసులు రెండు మార్గాల గేట్లు వేసి ఐదు మందే తహసీల్దార్ వద్దకు వెళ్లాలని సూచించారు. దీంతో ఎంపీలు మిథున్‌రెడ్డి, డాక్టర్ మద్దెల గురుమూర్తి, కాకాణి పూజిత లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలు కాంపౌండ్ వద్దకు రాకుండా పోలీసులు గేట్లు వేశారు. దీంతో పోలీసుల జులుం నశించాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తుంటే పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేయడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీలు మిథున్‌రెడ్డి, డాక్టర్ మద్దెల గురుమూర్తి, కాకాణి పూజిత తదితరులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.



వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

ఆప్యాయంగా పలకరించిన కాకాణి పూజిత

వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ముగిసిన అనంతరం మాజీ మంత్రి కాకాణి కుమార్తె పూజిత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్దకు కారుపైనే నిలబడి ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. మానాన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగాల్సిన కార్యక్రమంలో ఆయన లేకున్నా, ఇంతలా విజయవంతం చేశారని, మా కుటుంబంపై మీరు చూపిస్తున్న ప్రేమకు రుణపడి ఉంటానని చెప్పారు.



కార్యకర్తలను పలకరిస్తున్న పూజిత

అడుగడుగునా నిరసన గళం

- కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయాం
- స్వచ్ఛందంగా వచ్చి.. నిరసన తెలిపిన అన్నివర్గాల ప్రజలు



ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: హామీలను అమలు చేయకుండా, అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని కోవూరు నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, నిరసన గళం వినిపించారు. నియోజకవర్గంలోని కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు దాదాపు 2,500 మంది బుధవారం ఉదయం 9 గంటలకు కోవూరు బజారు సెంటర్‌కు చేరుకున్నారు. నిరుద్యోగ యువత, వలంటీర్లు, ఎండీయూ వాహన డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు పాల్గొని, వారికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించారు. ర్యాలీ కోవూరు బజార్ సెంటర్ నుంచి మందబయలు సెంటర్ వరకు సాగింది. మార్గమధ్యలో గాంధీబొమ్మ సెంటర్‌లో రాష్ట్రంలో జరుగుతున్న ఆరాచక పాలన గురించి, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాల గురించి వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి అందించారు. అనంతరం మందబయలు సెంటర్‌లో అందరూ ఏకమై, రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి తామంతా బలైపోయామని, నమ్మించి గొంతు కోయడంలో చంద్రబాబు దిట్ట అనే విషయన్ని మరోసారి రుజువు చేశారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం కింద ఆదుకున్నారని, ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మహానేతకు వినతి

కోవూరులోని మైదుకూరు సెంటర్ వద్దనున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్లకు రూ.5 వేల గౌరవం వేతనం ఇచ్చి జగనన్న ప్రజలకు సేవ చేసేందుకు నియమించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో రూ.10 వేలు జీతమిస్తామని చెప్పి వారిని పూర్తిగా తొలగించారన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు ఇస్తామని వారిని కూడా మోసం చేశారన్నారు. ఇలా 143 హామీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు రెండు వేలకు పైగా నమోదు చేసి ఎంతో మందిని జైలుకు పంపారన్నారు. రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు పెరిగిపోయాయన్నారు.

ఎండీయూ వాహనాలను అడ్డుకున్న పోలీసులు

కూటమి ప్రభుత్వం చేసిన మోసాలకు బలైపోయిన ఎండీయూ వాహన ఆపరేటర్లు స్వచ్ఛందంగా నిరసన తెలిపేందుకు వచ్చారు. వారి గోడును నిరసన కార్యక్రమం ద్వారా తెలియజేయాలని భావించారు. అయితే ఆ వాహనాలకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై అన్నివర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

⇨ **ఇందుకూరుపేట:** కోవూరులో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఇందుకూరుపేట మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మావులూరి శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, బట్టేపాటి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అరాచక పాలనపై వినతిపత్రం ఇస్తున్న ప్రసన్న



నిరసన ర్యాలీకి సంఘీభావం తెలుపుతున్న ఆటోవాలాలు



ప్రజల సమక్షంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

క్లుప్తంగా

వైభవంగా గజ వాహనోత్సవం



గజ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం గజ వాహనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పండ్లు, కొబ్బరికాయ, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఉదయం చప్పర ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.

సమస్యలపై అర్జీల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 7, 8, 9 వార్డుల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని సమస్యలపై ప్రజలు అధిక సంఖ్యలో అర్జీలు అందజేశారు. డ్రెయిన్స్, రోడ్లు, ఇళ్లు, పింఛన్లు తదితర సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయ భూమి వేలం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని వెంకటమ్మ పేరంటాలమ్మ దేవస్థానానికి సంబంధించి మనుమసిద్ధినగర్‌లో ఉన్న ఎకరా 24 సెంట్ల భూమిని రెండు బిట్లుగా 11 ఏళ్ల కాలపరిమితికి ఈ – ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించనున్నామని ఈఓ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఉదయం 11.30కు నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. వివరాలకు దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ



కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నృత్యంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగాపై శిక్షణ ఇవ్వడంతో పాటు పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు: రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ నిర్మలానందబాబాకు ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మేలు చేసే పథకాలను అమలు చేయాలన్నారు. ఈ క్రమంలో ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలను అందించాలని కోరుతూ జూన్ 11న మంగళగిరి సీసీఎల్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గండవరపు బుజ్జయ్య, గండవరపు దుర్గాప్రసాద్, షేక్.అహ్మద్, ఎం.సుబ్బారావు, బట్ట పెద్దబయ్య, కె.గోవర్ధన్, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

⇨ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వీఆర్ గ్రౌండ్స్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏడుకు నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నెల్లూరు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ అశోక్‌కుమార్, ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, మలేరియా విభాగాధికారి జిజియాబాయి, సూపరింటెండెంట్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

⇨ సీసీ రోడ్డును నూతనంగా నిర్మించి, ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని పలువురు కోరారు. ఈ మేరకు శంకరాగ్రహారంలోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలను సందర్శించిన కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని ఆస్పత్రి వైద్య బృందం, స్థానికులు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్తహాల్ నుంచి విజయమహల్ గేట్ వరకు, బాబూ ఐస్‌క్రీమ్స్ నుంచి బాక్స్ టైపు బ్రిడ్జి వరకు నిర్మించిన సీసీ రోడ్లు ఎత్తుగా ఉండటంతో వర్షాకాలంలో వరద నీరు ఆస్పత్రి మార్గంలో చేరుతోందని చెప్పారు. దీనిపై చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, వైద్యులు రమణయ్య, రమేష్‌బాబు, హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులకు అధునాతన వైద్యం

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో గుండె వ్యాధులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ విజయ్‌అమర్ నాథ్‌రెడ్డి తెలిపారు. గుండె వ్యాధులపై ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో కార్డియాలజిస్టులు బాలకృష్ణ, జయరామయ్య, మనోహర్‌రెడ్డిలతో కలిసి విజయ్‌అమర్ నాథ్‌రెడ్డి మాట్లాడారు. గుండెకవాటాలకు అత్యాధునిక చికిత్సను 24 గంటల పాటు తమ ఆస్పత్రిలో అందిస్తున్నామని వివరించారు.

కసుమూరు దర్గాకు సంగీత దర్శకుడు కోటి



వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలో మస్తాన్‌వలీ దర్గాను ప్రముఖ సంగీత దర్శకుడు కోటి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ క్రమంలో దర్గాకు వచ్చిన కోటికి ముజావర్లు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

తాగునీరు నేలపాలు



విడవలూరు: మండలంలోని పార్లపల్లి గ్రామం గవళ్లపాళెం వద్ద పంచాయతీ పైపులైన్ లీక్ కావడంతో గత నాలుగు రోజుల నుంచి దిగువ ప్రాంత గ్రామస్తులకు మురుగునీరు వస్తోంది. దీంతో పాటు పలుచోట్ల నీరు రోడ్డుపైకి చేరి నివాసాల్లోకి వస్తోంది. దీనిపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా నాలుగు రోజుల నుంచి ఎలాంటి పనులు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ను మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- ఊరెళ్లాలంటే నిరీక్షణే
- ఆటోల ప్రయాణమే దిక్కు
- గ్రామాలకెళ్లని బస్సులు

పొదలకూరు: ఆటో డ్రైవర్లు కనికరిస్తేనే కొన్ని మార్గాల్లోని ఊరెళ్లేందుకు వీలవుతుంది. లేదంటే గంటల తరబడి నిరీక్షణ చేయాల్సిందే. ప్రతినిత్యం గ్రామాల నుంచి మండల కేంద్రానికి పనులపై రావాలంటే ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆటోలు అందుబాటులో లేక ప్రయాణాలనే మానుకుంటున్నారు. ఆర్టీసీ బస్సు పాఠశాలల పని దినాల్లోనే గ్రామాలకు వెళ్తుంది. మిగిలిన రోజుల్లో ప్రయాణికులు ప్రమాదకరమైన ఆటోలనే ఆశ్రయించాలి. మండలంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నావూరు మార్గంలో వరుసగా భోగసముద్రం అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం వంటి ఏడు గ్రామాలు ఉన్నాయి. ఈ మార్గాల్లో ఎప్పుడు ఆటోలు కిటకిటలాడుతూనే ఉంటాయి. అన్ని వేళల్లో రవాణా సౌకర్యం అందుబాటులో లేక ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరు నుంచి భోగసముద్రం వరకు 20 కి.మీ దూరం ఉంది.



పొదలకూరు బస్టాండ్‌లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఆటోలనే ఆశ్రయించాలి

చాలా మార్గాలకు ఆటోలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఫలితంగా క్రమంగా బస్సులకు ఆదరణ తగ్గిపోయి ఆయిల్ ఖర్చులకు కూడా రాకపోవడంతో ఆర్టీసీ బస్సులను రద్దు చేసుకున్నాయి. అయితే ఇప్పటికీ తోడేరు, భోగసముద్రం, పులికల్లు, నల్లపాళెం మార్గాల్లో ఆర్టీసీ బస్సులను తిప్పుతున్నారు. ఆటోల్లో ప్రయాణిస్తున్న గ్రామస్తులు బస్సులను ఎక్కడం లేదు. ఫలితంగా విద్యార్థులు మాత్రమే బస్సులను ఎక్కుతున్నారు. ఆటోలు ఉన్న భోగసముద్రం మార్గంలో ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోంది.

తరచూ ప్రమాదాలు

ఆటోల ప్రయాణం ప్రమాదమని తెలిసినా గ్రామస్తులు అందులోనే ప్రయాణించాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి ఆటోల్లో పరిమితికి మించి తరలిస్తున్నందున తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిబంధనల ప్రకారం తరలిస్తే తమకు గిట్టుబాటు కాదని ఆటో డ్రైవర్లు వెల్లడిస్తున్నారు. దీనికి తోడు సకాలంలో ఆటోలు కూడా అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు.



గ్రామాలకు అప్పుడప్పుడు వెళ్లే ఆర్టీసీ సర్వీసు

ఇబ్బందిగా ఉంది



మా ప్రాంతాల నుంచి ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారింది. సకాలంలో ఆటోలు అందుబాటులో ఉండవు. ఆర్టీసీ బస్సు ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తుంది. ఊరి నుంచి పొదలకూరుకు అత్యవసరంగా వెళ్లాలంటే మోటారు బైక్ ఉండాల్సిందే. ముఖ్యంగా మహిళల ప్రయాణం ఇబ్బందిగా మారింది.

– వి.మాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి